సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం। 10। డిసెంబర్। 2024



అభీష్ట సిద్ధి.. అనుగ్రహ ప్రాప్తి..

అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి సన్నిధిలో సుదర్శన హోమం చేయించుకుంటే కోర్కెలు నెరవేరుతాయని భక్తులు భావిస్తారు.


8లో



రూ.55 వేల విరాళం

గోకవరం: స్థానిక శ్రీ స్కంద బాలాజీ సూర్య దేవాలయానికి నంగిసీడి రాంబాబు, కుమారుడు శివాజీ గణేష్, కోడలు శ్రీవాణిదుర్గ (దేవీపట్నం పునరావాస కాలనీ) రూ.55 వేల విరాళం అందించారు.

డెల్టాలకు 10,200 క్యూసెక్కులు




ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 10,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో 17,382 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వక్ఫ్ చట్టాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్



అమలాపురం టౌన్: రాష్ట్రంలో వక్ఫ్ చట్టాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేస్తోందని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ ఆరోపించారు. ఈ మేరకు అమలాపురంలో ఖాదర్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ముస్లిం, మైనార్టీలను అణగదొక్కే కుట్రలో భాగంగా వక్ఫ్ చట్టాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న వక్ఫ్ సవరణ బిల్లుతో రాష్ట్రంలోని ముస్లింలకు భవిష్యత్‌లో ఇబ్బందులు అనివార్యం కాగలవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించకుండా ముస్లింల మనోభావాలకు కాపాడాలని ఖాదర్ డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకించి ముస్లింకు అండగా ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు ఏర్పాటుకు కూడా ఓ పద్ధతి, విధానం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమర్ధమైన వక్ఫ్ బోర్డును నియమించి వక్ఫ్ ఆస్తులను సంరక్షించాలని ఖాదర్ డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు సవరణకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తల ఊపకూడదని, అందులోని లోపాలను ఎత్తిచూపి బిల్లును వ్యతిరేకించి ముస్లింలకు భరోసాగా నిలవాలని కోరారు.

మత్స్యకారుల ధర్నా

గెద్దనపల్లిలో నష్టపరిహారం నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణ



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గెద్దనపల్లి మత్స్యకారులు

అమలాపురం రూరల్: కాట్రేనికోన మండలం గెద్దనపల్లి గ్రామంలో మత్స్యకారుల నష్టపరిహారం నిధులు కొంతమంది దుర్వినియోగం చేశారని సంఘం నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రిలయన్స్, ఓఎన్జీసీ మత్స్యకారులకు చెల్లించిన నష్టపరిహారం ఎస్‌ఎఫ్‌డీసీ నిధులను కొందరు నాయకులు స్వాహా చేశారని గెద్దనపల్లి రామాలయం మత్స్యకారుల కుటుంబాలు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించాయి. ఐదు విడతలు సమానంగా పంచవలసిన సొమ్మును, కేవలం రెండుసార్లే పంచి, మూడు విడతల డబ్బును పంచకుండా తమను వేధిస్తున్నారని గెద్దనపల్లి అగ్నికుల క్షత్రియులు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు పంచమంటే గొడవలకు దిగి తమను వేధిస్తున్నారని కలెక్టర్ మహేష్‌కుమార్‌కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని, ప్రభుత్వం తమకు తక్షణం నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. ఒక పది మంది నాయకుల కనుసన్నల్లో ఈ దారుణం జరుగుతోందని, విచారణ చేసి బాధితులకు రూ.80 లక్షల పరిహారం అందజేయాలని సంఘం నాయకుడు నారాయణ డిమాండ్ చేశారు.

కౌశల్ జిల్లా స్థాయి విజేతలు

అమలాపురం టౌన్: ఈ నెల 6న ఆన్‌లైన్‌లో జరిగిన కౌశల్ -2024 జిల్లా స్థాయి పరీక్షల ఫలితాలను డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 8,9,10 తరగతుల విద్యార్థుల విభాగాల విజేతలు విజయవాడలో ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి కౌశల్-2024 పరీక్షల్లో సత్తా చాటనున్నారని తెలిపారు. ఎనిమిదో తరగతికి సంబంధించి క్విజ్ విభాగంలో ఎం.వెంకటరమణ (జెడ్పీ ఉన్నత పాఠశాల - మురమళ్ల) ప్రథమ, ఉంగరాల విశిష్ట నాగ సూర్య ప్రజ్ఞ (ఎస్‌జీ ఎంపీఎల్ హైస్కూలు- అంకసాని చెరువు), ద్వితీయ స్థానాలు సాధించారు. పోస్టర్ విభాగంలో జక్కంపూడి తులసీ చందు (ఎంపీఎల్ హైస్కూలు -కొంకాపల్లి), నవరపు రష్మిత (జెడ్పీహెచ్‌ఎస్-గొల్లవిల్లి), ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 9వ తరగతి క్విజ్ విభాగంలో దూడల హాసిని (ఎంపీఎల్ హెచ్‌ఎస్ - కొంకాపల్లి), పి.శ్రీరమ్య (జెడ్పీహెచ్‌ఎస్ - జి.పల్లిపాలెం), ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు. పోస్టర్ విభాగంలో పి.లక్ష్మిశ్రీ (జెడ్పీహెచ్‌ఎస్- జి.పల్లిపాలెం), ఆర్.కీర్తి (జెడ్పీహెచ్‌ఎస్ (జి) సూర్యనగర్ గెలిచారు. 10వ తరగతి క్విజ్ విభాగంలో పడాల లోకేశ్వర్‌రెడ్డి (జెడ్పీహెచ్‌ఎస్- మాచవరం), , ఒగ్గు కుశ్వంత్‌సాయి (జెడ్పీహెచ్‌ఎస్- మాచవరం) ద్వితీయ స్థానాలు సాధించారు. రీల్స్ విభాగంలో కారెం రేష్మశ్రీ (ఎంపీఎల్ హెచ్‌ఎస్- కొంకాపల్లి), సుతాపల్లి దేవ హర్ష నాగశ్రీ సందీప్ (ఎస్‌కేపీజీఎస్ గవర్నమెంట్ హెచ్‌ఎస్ -రామచంద్రపురం), ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వీరికి రూ.1,500, 1,000 చొప్పున నగదు బహుమతులు అందిస్తామని డీఈవో సలీమ్ బాషా తెలిపారు.

చెత్త సృష్టి.. సంపద వట్టి!



మండపేట 28 వార్డులో సంపద తయారీ కేంద్రంలో తాత్కాలికంగా నివాసముంటున్న సిల్ట్ తీత కార్మికులు



రావులపాలెం మండలం రావులపాడులో జాతీయ రహదారి చెంతనే పేరుకుపోయిన చెత్త

- జిల్లాలో 345 పంచాయతీలు
- 268 సంపద కేంద్రాలు
- 198 పనిచేస్తున్నాయంటున్న అధికారులు
- వాస్తవంగా పనిచేసేది పది శాతం మాత్రమే
- కంపోస్టు ఉత్పత్తి శూన్యం

సాక్షి, అమలాపురం: గ్రామ పంచాయతీలలో ఒకవైపు కొండలా పేరుకుపోతున్న చెత్తను తగ్గించుకోవడం.. మరోవైపు నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయడం... వాటి అమ్మకాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడం.. ఇలా మూడు లక్ష్యాలతో మొదలు పెట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లాలో 345 పంచాయతీలున్నాయి. వీటి ద్వారా రోజుకు వంద టన్నుల మేర చెత్త వస్తోందని అంచనా. మేజర్ పంచాయతీల్లో రెండు నుంచి మూడు టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇదే ఇప్పుడు పంచాయతీలకు పెద్ద సమస్యగా మారింది. డంపింగ్ యార్డులు లేకపోవడంతో రోడ్డు చెంతన, పంట కాలువల చెంతన చెత్త వదిలేస్తున్నారు. దీనివల్ల కాలుష్యం పెరిగి జనం రోగాల బారిన పడుతున్నారు. కొన్ని పంచాయతీలు చెత్తను కాల్చి బూడిద చేస్తున్నాయి. దీనివల్ల చెత్త సమస్య తగ్గినా ప్లాస్టిక్, టైర్లు వంటి వాటిని కూడా తగలబెట్టడం వల్ల విషవాయువులు గాలిలో కలిసి జనం ప్రాణాలకు ముప్పుగా మారుతోంది. ఈ సమస్య పరిష్కారానికి చెత్తతో సంపద కేంద్రాలు చాలా వరకు అక్కరకు వచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేశారు. జిల్లాలో 268 సంపద కేంద్రాలున్నాయి. వీటిలో 198 కేంద్రాలు పనిచేస్తున్నాయని, 46 పాక్షికంగా పని చేస్తున్నాయని, 25 కేంద్రాలలో వానపాముల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. కాని వాస్తవంగా పది శాతం కూడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ఈ కారణంగా పంచాయతీల్లో ఆశించిన స్థాయిలో చెత్త సమస్య తీరడం లేదు. అలాగే ఆదాయం కూడా రావడం లేదు.

సంపద కేంద్రాల ద్వారా చెత్త సమస్యకు పరిష్కారం

సంపద కేంద్రాల ద్వారా నెలకు సగటున నాలుగు టన్నుల వర్మీ కంపోస్టు తయారవుతోందని అంచనా. ఈ విధంగా చూస్తే ఏడాదికి 48 టన్నులు. కేజీ రూ.పది చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈ విధంగా చూస్తే ఏడాదికి రూ.4.80 లక్షల వరకు ఆదాయంగా వస్తోంది. జిల్లాలో మూడోవంతు పంచాయతీలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం కన్నా ఇది ఎక్కువ. కంపోస్టు తయారీకి సగటున నెలకు 16 టన్నుల చెత్తను వినియోగిస్తారు. ఈ విధంగా చూస్తే ఏడాదిలో సుమారు 192 టన్నుల చెత్తను కంపోస్టుగా మార్చవచ్చు. చిన్నిచిన్న పంచాయతీలకు చెత్త సమస్య దాదాపు తీరిపోతుంది. మీడియం, మేజర్ పంచాయతీలలో ఊరి చివర్లలోను, పంట కాలువల చెంతా చెత్త కొండల్లా పేర్చాల్సిన అవసరం తప్పుతుంది. డంపింగ్ యార్డు సమస్యలు సైతం చాలా వరకు తీరతాయి.

పంచాయతీల నిర్లక్ష్యం

- పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు, పారిశుధ్య సిబ్బందిలో చిత్త శుద్ధి లేకుండా పోయింది. కంపోస్టు తయారీని పక్కన పెడుతున్నారు. చాలా పంచాయతీలకు పారిశుధ్య సిబ్బంది లేకపోవడం కూడా ఇందుకు కారణంగా కనిపిస్తోంది.
- అన్నీ ఉన్నచోట సిబ్బందిలో చిత్తశుద్ధి లేదు. సంపద కేంద్రాలు ఎంతోకొంత పనిచేస్తున్న చోట నాణ్యమైన కంపోస్టు ఉత్పత్తి జరగడం లేదు. వానపాములు తరచూ చనిపోతున్నాయి. ఈ కారణంగా కంపోస్టు కావడం లేదు.
- కార్మికులకు కంపోస్టు తయారీపై శ్రద్ధ లేకుండా పోవడం కూడా ఒక కారణం. తడి, పొడి చెత్త, ప్లాస్టిక్, గాజు సీసాలు, ఐరన్, ఇతర వ్యర్థాలు అన్నీ కలిసి సంపద కేంద్రాల వద్దకు వస్తున్నాయి. వీటిని వేరు చేసి కంపోస్టు తయారీకి అవసరమైన వ్యర్థాల సేకరణకు సరిపడా సిబ్బంది లేకుండా పోయారు.
- కంపోస్టు కేంద్రాల్లో సిమెంట్ కుండీల తయారీ కంపోస్టుకు అనుకూలం కాదు. నాణ్యమైన కంపోస్టు తయారు కావాలంటే అడుగు ఎత్తున సిమెంట్ కుండీ నిర్మాణం చేయాలి. కాని కుండీ ఎత్తు రెండు, మూడు అడుగులు ఉండడం వల్ల కంపోస్టు అనుకున్న నాణ్యతతో రావడం లేదు.
- కంపోస్టుకు ఉపయోగించే వానపాములు నాన్ బోరియింగ్ రకానికి చెందినవి. ఇది తక్కువ ఎత్తు ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలను కంపోస్టుగా మారుస్తాయి. అధిక ఎత్తు ఉంటే మాత్రం అనుకున్నంత వేగంగా కంపోస్టు తయారు చేయడం లేదు.
- సంపద కేంద్రాల వద్ద అమ్మకాలు చేసే కంపోస్టును రెండవ సారి కొనుగోలు చేసేవారు లేకుండా పోతున్నారు. దీంతో తయారైన అరకొర కంపోస్టును సైతం వాడేవారు లేక పంచాయతీలకు వచ్చే కొద్దిపాటి ఆదాయం కూడా రావడం లేదు.



రావులపాలెం మండలం కొమరాజులంకలో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద కేంద్రం

- కొత్తపేట నియోజకవర్గంలో 57 పంచాయతీలు ఉండగా, వీటిలో 20 మేజర్‌వి. వీటిలో రెండింటికి మాత్రమే డంపింగ్ యార్డులు ఉండగా, మిగిలిన వాటికి లేవు. ఇక్కడ చెత్త సమస్య అధికంగా ఉంది. 34 సంపద కేంద్రాలుండగా, కేవలం 11 మాత్రమే పనిచేస్తున్నాయి.
- అమలాపురం నియోజకవర్గంలో గ్రామ పంచాయతీలు 60 కాగా, ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి, భీమనపల్లి, ఎన్.కొత్తపల్లి మేజర్ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ఉన్నా ఉపయోగం లేదు. అమలాపురం మండలంలో 12 గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలలో ఐదు పనిచేస్తున్నాయి.



ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో కంపోస్టు తయారు కాని సంపద కేంద్రం

చెత్త సమస్య పరిష్కారాలకు ఇది మంచి ప్రయత్నం



బండారులంక మేజర్ పంచాయతీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చెత్త. దీని పరిష్కారానికి డంపింగ్ యార్డు అతి ముఖ్యమైంది. సంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తే చాలా వరకు చెత్త సమస్యకు పరిష్కారం లభిస్తుంది. పంచాయతీలకు ఆదాయం కూడా వస్తుంది. – దైవాపు పూర్ణిమ, సామాజిక కార్యకర్త, బండారులంక, అమలాపురం మండలం

ఉత్సాహంగా సంస్కృతి ఉత్సవ్ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక యర్రమిల్లి వారి వీధిలోని హనుమాన్ మందిర్ వద్ద ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి ఉత్సవ్ పోటీలు సోమవారం ఉత్సాహంగా మొదలయ్యాయి. సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవ్ పోటీలు 9 విభాగాల్లో జిల్లా స్థాయిలోనూ, 5 విభాగాల్లో ఇంటర్‌నెట్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలోనూ జరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని మన సంస్కృతిని ప్రతిబింబించే అంశాలను ప్రదర్శించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి మరీ ఈ పోటీల్లో పాల్గొని మన సంస్కృతికి అద్దం పట్టారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ చదివేవారు పోటీల్లో పాల్గొన్నారు. భగవద్గీత, మట్టితో బొమ్మలు చేయడం, కథలు చెప్పడం, జానపద నృత్యాలు, సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా వ్యాసరచన పోటీలు తొలి రోజు జరిగాయి. మయూరం పేరుతో చిత్రకారుడు ముద్దు రమేష్ ఏర్పాటు చేసిన డిజిటల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ విద్యార్థులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సంస్కార భారతి రాష్ట్ర మహిళా ప్రముఖ్ వేదనభట్ల సాయిలక్ష్మి, లారెన్స్ మాస్టర్ శిష్యుడు ధనరాజ్, ఆకొండి ధన్వంతరి, దేవపూజ్యల నాగమణి, ఓరుగంటి అగ్నిహోత్ర శర్మ వ్యవహరించారు. భారతం, రామాయణం తదితర పురాణ ఇతిహాసాలు, భారతీయ విజ్ఞాన వైభవం వంటి అంశాల్లో వ్యాస రచన పోటీలు జరిగాయి. ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ట్రస్ట్ ప్రతినిధులు చాణక్య, తేజస్విని, లావణ్య, కౌటిల్య, యశస్విని, భరద్వాజ్ సంయోజకులుగా వ్యవహరించారు.

గాలికొదిలేసిన కూటమి హామీలే అజెండా

- నేడు వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమావేశం
- ముఖ్య అతిథిగా పాల్గొంటున్న రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం కాకినాడలో మంగళవారం జరగనుంది. స్థానిక సూర్య కళా మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో పార్టీ ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు సోమవారం ఈ వివరాలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న పార్టీ తొలి సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నామని చెప్పారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజల తరఫున నిర్వహించే పోరాటాలపై ఈ సమావేశంలో చర్చించనున్నామని తెలిపారు. ఈ నెల 13న రైతు సమస్యలపై కలెక్టరేట్ల వద్ద నిరసన, 27న విద్యుత్ చార్జీల పెంపుపై ఎస్ఈ కార్యాలయాల వద్ద, జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట తప్పిన కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా నిర్వహించే ఆందోళనలపై ఈ సమావేశంలో చర్చించనున్నామని వివరించారు. వీటితో పాటు సార్వత్రిక ఎన్నికల్లో ఎడాపెడా ఊదరగొట్టి, గాలికొదిలేసిన సూపర్‌సిక్స్ హామీలు, భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ అడ్డగోలుగా సోషల్ మీడియా కార్యకర్తలపై ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ, పార్టీ కమిటీల నియామకాలపై కూడా చర్చించనున్నారని తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షులు, పార్టీ ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ముఖ్య నేతలు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కన్నబాబు విజ్ఞప్తి చేశారు.

గడువులోపు అర్జీల పరిష్కారం

కలెక్టర్ మహేష్‌కుమార్ సూచన



అర్జీలను తీసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి తదితరులు



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యలను రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డ్వామా పీడీ మధుసూదన్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి 168 అర్జీలు స్వీకరించారు. సామాజిక భద్రత పింఛన్ల మంజూరు, వైద్య సేవల కల్పన, భూ సమస్యలు తదితర అంశాలపై అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ అందిన అర్జీ సర్వీస్ అంశమా లేదా ఫిర్యాదా అనేది గమనించి కచ్చితమైన విశ్లేషణ చేస్తూ సంబంధిత విభాగాలకు ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యంగా మంగళవారం నుంచి జనవరి 8 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ సదస్సులపై నియోజకవర్గ మండల ప్రత్యేక అధికారులు తహసీల్దారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రత్యేక అధికారులు రోజూ సదస్సుల నిర్వహణ తీరును, ఆర్డీవోలు రోజుకు రెండు సదస్సులను తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 25 అర్జీలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 25 అర్జీలు వచ్చాయి. ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారుల వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. రామచంద్రపురానికి చెందిన ఓ ప్రేమ జంట ఎస్పీని ఆశ్రయించారు. తమకు ప్రాణ రక్షణ కల్పించాలని విన్నవించుకున్నారు. తమ కుటుంబీకులు, బంధువుల నుంచి తమను కాపాడాలని వారు అభ్యర్థించారు. అర్జీదారుల ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఎస్పీ కృష్ణారావు ఆయా పోలీసు స్టేషన్ల సీఐ, ఎస్సైలకు ఫోన్ చేసి ఆదేశించారు. వచ్చిన 25 అర్జీల్లో సగం వరకూ కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించినవే ఉండడంతో అర్జీదారులతో ఎస్పీ మాట్లాడి సమస్య పరిష్కారానికి మార్గాలను సూచించారు. మహిళా ఎస్సై శశాంక ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజేత.. భీమవరం బుల్లోడే!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి
- తొలి ప్రాధాన్య ఓట్లలోనే గెలుపు
- బడి నుంచి మండలికి పయనం
- ఆరు గంటల్లోనే ముగిసిన ఓట్ల లెక్కింపు

ఎవరికెన్ని ఓట్లంటే..

బొర్రా గోపిమూర్తి	9,165
గంధం నారాయణరావు	5,259
దీపక్ పులుగు	102
నామన వెంకటలక్ష్మి (విళ్ల లక్ష్మి)	81
డాక్టర్ నాగేశ్వరరావు కవల	73



కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపు కోలాహలం



కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారి షణ్మోహన్



గెలుపు అనంతరం విజయ చిహ్నం చూపిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి



ఎమ్మెల్సీగా ఎన్నికైన గోపిమూర్తికి ధ్రువపత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి షణ్మోహన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉత్కంఠగా సాగిన గురువుల పోరులో భీమవరం బుల్లోడు విజేతగా నిలిచారు. ఆరు జిల్లాల పరిధిలో హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి గెలుపొందారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన ఆయన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల బరిలోకి దిగేందుకు తన వృత్తికి రాజీనామా చేశారు. గోపిమూర్తికి ప్రధాన ప్రత్యర్థిగా ద్రాక్షారామకు చెందిన గంధం నారాయణరావు బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ మిగిలిన ముగ్గురూ నామమాత్రమైన పోటీకే పరిమితమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి చివరి వరకూ బొర్రా, గంధం మధ్యనే నువ్వా నేనా అనే స్థాయిలో పోటీ కనిపించింది. చివరకు యూటీఎఫ్, పీడీఎఫ్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగిన గోపిమూర్తికి విజయం వరించింది. గత ఎన్నికల్లో సైతం నారాయణరావు పీడీఎఫ్ అభ్యర్థితో తలపడ్డారు.

సాబ్జీ మృతితో..

శాసన మండలి ఉమ్మడి ఉభయ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి రెండున్నరేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందిన సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. మిగిలిన రెండున్నరేళ్ల పదవీ కాలానికి ఎన్నికల కమిషన్ ఈ ఎన్నిక నిర్వహించింది.

ఆది నుంచీ ఉత్కంఠగా..

ఈ ఎన్నికలు ఆది నుంచీ తీవ్ర ఉత్కంఠను రేకెత్తించాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు (రంపచోడవరం) జిల్లాల్లో విస్తరించి ఉన్న ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు 15,494 ఓట్లు పోలయ్యాయి. చెల్లుబాటు అయిన మొత్తం ఓట్లను ప్రామాణికంగా తీసుకుని కోటా ఓట్లను 7,341గా నిర్ణయించారు. గోపీమూర్తికి తొలి రౌండ్‌లోనే కోటా ఓట్లు దక్కాయి. దీంతో ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఎన్నికల కమిషన్ ఆమోదంతో ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. గోపీమూర్తికి 9,165 ఓట్లు పోలవగా, రెండో స్థానంలో ఉన్న నారాయణరావు 5,259 ఓట్లు దక్కించుకున్నారు. దీంతో 3,906 ఓట్ల ఆధిక్యతతో గోపిమూర్తిని విజయం వరించింది. యూటీఎఫ్, పీడీఎఫ్ ఉమ్మడిగా బలపరిచిన గోపీమూర్తి వెంట ఆ రెండు సంఘాల ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు. సిట్టింగ్ స్థానంపై పట్టు సాధించాలని ఉపాధ్యాయులు కలసికట్టుగా పని చేసినా.. ప్రధాన పోటీదారుగా నిలిచిన గంధం నారాయణరావు చివరి వరకూ గట్టి పోటీయే ఇచ్చారు. రెండున్నరేళ్ల పదవీ కాలానికి జరిగిన ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ చివరకు తన స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంది.

ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్, కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, బరిలో నిలిచిన ఐదుగురు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. 14 టేబుళ్లపై 76 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపు చేపట్టారు. కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, అర్బన్ తహసీల్దార్ జితేంద్ర పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వాణి వినిపిస్తా..

ఓట్ల లెక్కింపు అనంతరం గోపిమూర్తి మీడియాతో మాట్లాడుతూ, ఉపాధ్యాయుల వాణిని మండలిలో వినిపిస్తానని చెప్పారు. సీపీఎస్ రద్దు పోరాటానికి మద్దతుగా ఉద్యమంలో ముందుంటానని, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందుకున్న అనంతరం మద్దతుదార్లతో కలసి కాకినాడ యూటీఎఫ్ హోం వరకూ గోపిమూర్తి ర్యాలీగా వెళ్లారు.

తొలి రౌండ్‌లోనే..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఆరు గంటల్లోనే ముగిసింది. కాకినాడ జేఎన్‌టీయూ అంబేడ్కర్ లైబ్రరీలో సోమవారం ఉదయం 8 గంటలకు మొదలై, మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. తొలి రౌండ్‌లోనే మొదటి ప్రాధాన్యతా ఓట్లకే కోటా ఓట్లు రావడంతో గోపిమూర్తిని విజయం వరించింది.

గురువుల ఓట్లు చెల్లలేదే!

ఉపాధ్యాయులంటే సమాజానికి మార్గనిర్దేశకులుగా పేర్కొంటారు. అటువంటి గురువులు వేసిన ఓట్లే చెల్లుబాటు కాకపోవడం విస్మయం కలిగించింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసేసరికి ఏకంగా 814 ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. ఓటింగ్‌పై అవగాహన లేనందువల్లనో లేక నిరక్షరాస్యత కారణంగానో సాధారణ ఎన్నికల్లో చెల్లని ఓట్లు ఉండడం సహజం. కానీ, స్వయంగా చదువుకుని, నలుగురికీ చదువు చెప్పే గురువుల ఓట్లే చెల్లుబాటు కాకపోవడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది.

క్లుప్తంగా

కామధేను జాతీయ పురస్కారం అందుకున్న శంఖారావ యు'గళం'



తెలంగాణ హైకోర్టు జడ్జి నందా నుంచి పురస్కారం అందుకుంటున్న నరసింహారావు దంపతులు


రాజమహేంద్రవరం రూరల్/పి.గన్నవరం: నిర్విరామంగా 20 నిమిషాల పాటు శంఖారావాన్ని పూరించడంలో జాతీయస్థాయిలో ఖ్యాతిని ఆర్జించి అనేక రికార్డులను, అవార్డులను, సువర్ణ ఘంటా కంకణాలు సాధించిన శంఖారావ యు'గళం' డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు మరో జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ దంపతులకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ కామధేను జాతీయ పురస్కారాన్ని ఆదివారం హైదరాబాద్ టూరిజం ప్లాజాలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేసింది. ఆ సంస్థ సీఈఓ సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందా చేతుల మీదుగా ఆ దంపతులు పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డుల ప్రదానోత్సవాన్ని వీరి శంఖారావంతో ప్రారంభించారు. పి.గన్నవరానికి చెందిన డాక్టర్ నరసింహరావు ఏపీ ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) కమాండెంట్‌గా రాజమహేంద్రవరంలో విధులను నిర్వర్తిస్తున్నారు.

అభీష్ట సిద్ధి.. అనుగ్రహ ప్రాప్తి..

- లోక కల్యాణార్థం శ్రీ నారసింహ సుదర్శన హోమం
- 2010 నుంచి అంతర్వేదిలో నిత్యం నిర్వహణ
- 16 ఆయుధాలు, 16 భుజాలు కలిగిన స్వామి
- నవ బుధవార, నవ ప్రదక్షిణ దీక్ష నిర్వహిస్తున్న భక్తులు



అంతర్వేది ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీనారసింహ సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు(ఫైల్)



అంతర్వేది ఆలయంలో సుదర్శన హోమం వద్ద వివరాలు తెలుసుకుంటున్న శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి (ఫైల్)

సఖినేటిపల్లి: దక్షిణ కాశీగా ప్రసిద్ధి నొందిన అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దర్శనం జన్మ జన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు. నవ బుధవార నవ ప్రదక్షిణ దీక్ష చేసి శ్రీనారసింహ సుదర్శన హోమం చేయించుకోవడం ద్వారా తమ సకల అభీష్టాలు, సర్వ కార్యాలు నెరవేరుతాయని నమ్ముతారు. క్షేత్రంలో స్వయం భూ గా లక్ష్మీనసింహస్వామి వెలిసినట్టు చరిత్ర చెబుతోంది. వశిష్ట మహర్షి ప్రార్థన కారణంగా ఇక్కడ స్వామి పశ్చిమ ముఖంగా వేంచేసి భక్తులను అనుగ్రహిస్తున్నారు. స్వామివారి సన్నిధిలో అత్యంత పురాతనమైన 16 ఆయుధములు, 16 భుజములు కలిగిన సుదర్శన చక్రధారుడైన లక్ష్మీనరసింహస్వామికి (శ్రీసుదర్శన పెరుమాళ్) నిత్యం సుదర్శన హోమం నిర్వహిస్తున్నారు. భక్తుల మనోవాంఛా ఫలసిద్ధికి, సర్వగ్రహ దోష నివారణకు, లోక కల్యాణార్థం ఈ హోమం అత్యంత శాస్త్రోక్తంగా అర్చకులు, వేద పండితులు నిర్వహిస్తున్నారు.

2010 నుంచి...

స్వామివారి సన్నిధిలో నిత్య శ్రీసుదర్శన హోమం ప్రారంభించక పూర్వం భక్తులు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ సొంతంగా వెచ్చించి ప్రత్యేకంగా సుదర్శన హోమం నిర్వహించుకునేవారు. అయితే కాలక్రమంలో భక్తులందరికీ సుదర్శన హోమంలో పాల్గొనే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో దేవస్థానం అధికారులు, వైదిక సిబ్బంది సమాలోచన చేసి, నిత్య శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహించుకునేందుకు నిర్ణయించారు. ఇందుకు విధి విధానాలు రూపొందించాక 2010 సంవత్సరంలో హోమం ప్రారంభించారు. దశాబ్దన్నర కాలంగా నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

వీక్షించిన మహాస్వామి : అంతర్వేది లక్ష్మీనృసింహుని దర్శనానికి ఇటీవల విచ్చేసిన శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సుదర్శన హోమం వీక్షించారు. హోమం నిర్వహణ, ఇతర అంశాల గురించి ఆలయ ప్రధాన అర్చకుడు కిరణ్.. భారతీ మహాస్వామికి వివరించారు.

రూ.కోటి ఏడు లక్షల ఎఫ్‌డీలు



అంతర్వేది దేవస్థానంలో శ్రీనారసింహ సుదర్శన హోమంలో స్వామివారి శాశ్వత పూజల నిమిత్తం భక్తుల నుంచి ఇంత వరకూ రూ.ఒక కోటి ఏడు లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఆదాయాన్ని బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో భద్రపరిచాం.

– వి.సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్, అంతర్వేది దేవస్థానం

భక్తుల మనోవాంఛా ఫలసిద్ధి



భక్తులు శ్రీనారసింహ సుదర్శన హోమం నిర్వహించుకోవడం ద్వారా మనోవాంఛా ఫలసిద్ధి కలుగుతుంది. సర్వగ్రహ దోష నివారణ, లోక కల్యాణం సుదర్శన హోమంలో పూజల వల్ల సిద్ధిస్తుంది.

– పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, ప్రధాన అర్చకుడు, అంతర్వేది దేవస్థానం

శాశ్వత పూజల కోసం భక్తుల విరాళాలు

సంవత్సరం	వచ్చిన మొత్తం (రూ.లలో)
2010-2011	9,32,100
2011-2012	17,52,800
2012-2013	16,85,400
2013-2014	15,93,800
2014-2015	25,96,400
2015-2016	25,97,100
2016-2017	30,13,300
2017-2018	29,92,300
2018-2019	39,22,700
2019-2020	41,46,500
2020-2021	21,50,500
2021-2022	30,59,100
2022-2023	51,04,300
2023-2024	63,22,200
2024-2025	32,19,300

(నవంబర్ 2024 వరకూ)

హోమం రుసుముల వివరాలు ఇలా..

ఒక రోజుకు	రూ.400
ఒక నెలకు	రూ.4,000
మూడు నెలలకు	రూ.10,000
ఆరు నెలలకు	రూ.20,000
ఒక సంవత్సరానికి	రూ.40,000
శాశ్వతం(10 సంవత్సరాలు)	రూ.1,00,000

బ్రిడ్జిపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య



రాజు మృతదేహం

అల్లవరం: అమలాపురం రూరల్ పేరూరు పంచాయతీ తలుపులపేటకు చెందిన అంబటి రాజు (22) బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకి ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సినిమాకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన రాజు ఆదివారం రాత్రి 10 గంటలకు బ్రిడ్జి వద్దకు వచ్చి మోటారు సైకిల్‌ని పార్కు చేసి, చెప్పులు వదిలి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే సమయంలో కొంతమంది మోటారు సైకిల్‌ను పార్కు చేసి ఉండడాన్ని గమనించారు. సోమవారం ఉదయం వరకు మోటారు సైకిల్ బ్రిడ్జిపైనే పార్కు చేసి ఉండడంతో ప్రయాణికులు గమనించి 100కి సమాచారం ఇచ్చారు. దీంతో అల్లవరం పోలీసులు అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారులతో గాలించగా నదిలో మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చారు. మృతుడు తండ్రి పాపారావు ఫిర్యాదుతో అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఏ కారణం వల్ల ఆత్మహత్యకు పాల్పడ్డాడో విచారణలో తెలియవలసి ఉంది. మృతుడుకి తండ్రి, తల్లి ఉన్నారు.



పడవ యజమానులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు



సీజ్ చేసిన బోట్లు

18 బోట్లు సీజ్

- జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
- బ్రిడ్జిలకు 500 మీటర్ల లోపు ఇసుక తవ్వితే చర్యలు
- బోట్స్‌మెన్ సభ్యులపై క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం)/కొవ్వూరు: నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు కం రైలు వంతెనకు సమీపంలో సోమవారం ఇసుక తవ్వకాలు చేస్తున్న 18 బోట్లను సీజ్ చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ప్రకటించారు. కొవ్వూరు ఏరినమ్మ ఘాట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొవ్వూరు ఏరినమ్మ, ఔరంగబాద్-1 ఇసుక ర్యాంపులకు చెందిన పది, రాజమహేంద్రవరం దోబీఘాట్‌లో 8 బోట్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. బ్రిడ్జిలకు 500 మీటర్ల దూరంలో ఏవిధమైన తవ్వకాలు చేపట్టకూడదనే నిబంధన ఉంది. తెల్లవారు జాము నుంచే పడవల సాయంతో రోజూ ఇసుక త్వవకాలు చేస్తున్నారని జేసీ తెలిపారు. మైనింగ్, ఇరిగేషన్ అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్సు సహకారంతో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తున్న బోట్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. బోట్ల నిర్వాహకులు తెలిసే ఈ తవ్వకాలు చేస్తున్నట్టు తమ విచారణలో వెల్లడైందన్నారు. బోట్లను సీజ్ చేయడమే కాకుండా యజమానుల పైన, బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొవ్వూరులో సీజ్ చేసిన పది బోట్లను గోష్పాదక్షేత్రంలోని బోట్‌పాయింట్ వద్ద భద్రపరిచినట్లు ఏజీఆర్‌బీ డీఈఈ కె.ఆనంద్‌బాబు తెలిపారు. మైనింగ్ ఏడీ ఫణి భూషణ్‌రెడ్డి, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు, టాస్క్‌ఫోర్సు అధికారులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



బొక్కా వెంకట రమణ (ఫైల్)

ముమ్మిడివరం: అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె కుమారుడు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాయుడువారిపాలెంకు చెందిన బొక్కా వెంకట రమణ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుమారుడు విజయరాజు ఫిర్యాదు చేశాడు. ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దుర్మరణం

కొవ్వూరు: చాగల్లు–కొవ్వూరు మధ్య డీలైన్ ట్రాక్ మధ్య ఆదివారం రాత్రి విజయవాడ–విశాఖపట్నం వైపు వెళ్లే రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. వయసు 45 ఏళ్లు ఉండవచ్చునని రైల్వే పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుడిచేతిపై ఈశ్వర్ అని, కుడి జబ్బపై త్రిశూలం, నాగు పాము, ఢమరుకం గుర్తులతో పచ్చబొట్టు ఉంది. నిడదవోలు రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

మనుగడకు ముప్పు తేవొద్దు

- పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టం చేస్తున్న ఎల్‌ఐసీ యాజమాన్యం
- ధ్వజమెత్తిన యూనియన్ నాయకులు



మహాధర్నాలో ఐక్యత చాటుతున్న యూనియన్ నేతలు మాధవరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థ ఉన్నతికి దోహదపడిన దేశంలోని 14 లక్షల మంది ఏజెంట్ల మనుగడకు నష్టం కలిగించే విధంగా యాజమాన్యం ప్రవర్తించడం సరికాదని, పాలసీదారుల ప్రయోజనాలకు ఇబ్బందులు వస్తాయని అఖిల భారత జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) రాజమండ్రి డివిజనల్ అధ్యక్షుడు రావుల మాధవరావు అన్నారు. జీవిత బీమా సంస్థ ఏజెంట్ల మనుగడకు భంగం కలిగించే విధంగా యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా అఖిల భారత జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) పిలుపు మేరకు సోమవారం మోరంపూడి ఎల్‌ఐసీ రాజమహేంద్రవరం డివిజనల్ ఆఫీసు ఎదుట రాజమహేంద్రవరం డివిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం డివిజనల్ అధ్యక్షుడు రావుల మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ జీవిత బీమా సంస్థ(లియాఫి) సెప్టెంబర్ 30 వరకు అమలులో ఉన్న పాలసీలు అన్నింటిని క్లోజ్ చేసి అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త పాలసీలను ప్రవేశపెట్టిందన్నారు. అందులో ఏజెంట్లకు కస్టమర్లకు ఇబ్బంది కలిగించే విషయాలను పొందుపరిచిందన్నారు. క్లా బ్యాక్ కమిషన్ స్ట్రక్చర్ని మార్చడం, మినిమం బీమా మొత్తాన్ని రూ.రెండు లక్షలకు పెంచడం, పాలసీల్లో వయోపరిమితిని తగ్గించటం, ప్రీమియం రేట్లు పెంచడం చేసిందన్నారు. వీటన్నిటిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి చేస్తున్న తమ ఆందోళనను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆలిండియా ఈసీ సభ్యుడు మస్తాన్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి (నాగబాబు), గౌరవ అధ్యక్షుడు వంగా త్రిమూర్తులు, జోనల్ వైస్ ప్రెసిడెంట్ దొరబాబు, జోనల్ మెంబర్ సాంబమూర్తి, కోశాధికారి పిండి రెడ్డమ్మ, ఆల్ ఇండియా ఈసీ మెంబర్ అరవింద్, సీడబ్ల్యూఏ డివిజన్ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాస్ మాట్లాడారు. మెయిన్ బ్రాంచి అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు, అధ్యక్షుడు గండిబోయిన శ్రీనివాసరావు, సెక్రటరీ పట్నాల సుధాకర్, రూరల్ బ్రాంచి ప్రెసిడెంట్ ఆదిమూలం సాయిబాబా, డివిజన్‌లోని 20బ్రాంచ్‌ల నుంచి ఏజెంట్‌లు మహాధర్నాలో పాల్గొన్నారు.



రగ్బీ జట్ల ఎంపిక



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ జూనియర్ రగ్బీ బాలుర జట్టు



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ జూనియర్ రగ్బీ బాలికల జట్టు

కరప: మండలంలోని గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ జూనియర్(అండర్–15) బాలురు, బాలికల రగ్బీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కరప, పిఠాపురం, కొమరిగిరి, రామచంద్రపురం మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నెల 15, 16 తేదీలలో గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో జిల్లా జట్లు పాల్గొంటాయని హెచ్‌ఎం ఎం.సాయిమోహన్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.నాగలింగేశ్వరరావు, పద్మ, శేషుకుమారి, ఎల్.సతీష్, వంశీ, వీవీ రమణమూర్తి, ఐ.ప్రసాదరావు పర్యవేక్షణలో రగ్బీ జట్ల ఎంపిక నిర్వహించారు.

అండర్–15 బాలుర రగ్బీ జట్టు

డి.విజయకుమార్, వైవీఎస్ మణిదీప్, పి.వినయ్‌లోకేష్, కె.నాగవిష్ణు, వి.హేమంత్, ఎ.క్రాంతి, జె.గౌతమ్ అజయ్‌కృష్ణ, కేఎంఎస్ సాగర్, అభిరామ్, డి.విజయ్‌కుమార్, జె.ప్రేమ్‌కుమార్, కేఏ వలీషా, ఎ.గోవిందరాజు, జె.గౌతమ్ ఎంపికయ్యారు.

అండర్–15 బాలికల రగ్బీ జట్టు

వై.జ్యోతిచంద్రిక, ఎస్.వినీలా, ఎస్.చాందినీ, జి.తేజస్వి, పి.వీరలత దివ్య, పి.శృతి, జి.మణిరాజేశ్వరి, టి.చంద్రకళ, కె.అమృత, పి.లోలాక్ష్య దేవి, డి.అలేఖ్య, ఎస్.దీపిక, కె.అఖిల, టి.వీరలక్ష్మి, పి.నిహారిక, బి.శిల్ప ఎంపికయ్యారు.